ఏ బిడ్డా... ఇది మా అడ్డా.. ఇదేంటి సినిమా డైలాగ్ అనుకుంటున్నారా..! అవును పశ్చిమ నియోజకవర్గంలో ఆ నేత హవా అలా సాగుతోంది. అపార్ట్‌మెంట్ వేయాలను కుంటున్నవారు ముందుగా ఆ ప్రజాప్రతినిధిని కలవాల్సిందే.. కప్పం కట్టాల్సిందే.. అలా కాకుండా ఎవరూ నిర్మాణం చేపట్టినా బినామీలు వాలిపోతారు. నిబంధనలకు విరుద్ధంగా ఉందని బెదిరిస్తారు. నిర్మాణాన్ని బట్టి ఎంతకప్పం కట్టాలో నిర్ణయిస్తారు. ఇక అదనపు అంతస్తు అయితే ఏకంగా ఓ రేటు పెట్టేశారనే టాక్ నడుస్తోంది. దీంతో నిర్మాణాలు చేయలేక పనులు ఆపేస్తున్నారు. గతంలో ఇంత దారుణం లేదని.. ఈ సారి బరి తెగిస్తున్నారని వాపోతున్నారు.



- అధికారుల కంటే ముందు నాయకులను కలవాలి
- బినామీలతో ఏ వార్డులో ఏం జరుగుతుందో క్షణాల్లో సమాచారం
- అదనపు అంతస్తయితే భవనాన్ని బట్టి రేటు
- భయాందోళనలు వ్యక్తం చేస్తున్న బిల్డర్లు

ఏ బిడ్డా.. ఇది మా అడ్డా!

అపార్ట్‌మెంట్ నిర్మిస్తున్నావా .. కప్పం కట్టాల్సిందే..!

గోపాలపట్నం: **అవి ఒకప్పుడు నగరానికి శివారు** ప్రాంతాలు.. **మహా విశాఖ విస్తరించడంతో** ఇప్పుడు శరవేగంగా **అభివృద్ధి చెందుతున్నాయి.** విమాన్‌నగర్, కాకానినగర్, **89వ వార్డు భగత్‌సింగ్** నగర్, చంద్రనగర్, **గోపాలపట్నం ప్రాంతాల్లో** అపార్ట్‌మెంట్‌లు **వెలుస్తున్నాయి. దీన్నే సదరు** ప్రజాప్రతినిధి **అవకాశంగా మలుచుకున్నారు. అం**తా ఆయన కనుసన్నల్లోనే జరగాలని హుకం జారీ చేశారు. అధికారుల కంటే ఆయనకే సమాచారం చేరాలి. అందు కోసం ప్రతీ వార్డులో ప్రత్యేక వేగులను నియమించుకున్నారు. పలువురు బినామీలతో కథనడిపిస్తున్నారు.

టౌన్ ప్లానింగ్‌పై ఫోకస్

భవన నిర్మాణాన్ని బట్టి కప్పం... రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు వసూలు ఇది బహిరంగంగా వినిపిస్తున్న మాట.వార్డుల్లో జరిగే ఇబ్బందులకు చెక్ పెట్టాల్సిన పెద్దమనిషే ఈ సారి చాలా దారుణంగా వ్యవహరిస్తున్నాడన్న విమర్శలు వినిపిస్తున్నాయి. చాలా దారుణంగా వసూలు చేస్తున్నారని వాపోతున్నారు. అయితే ఇది ఆయన వద్ద **ఉంటున్న నాయకుల పనా...లేకా ఆయనకు తెలిసే జరుగుతుందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సాధారణ కార్యకర్తలు మాత్రం నమ్మకం కుదరడం లేదని.. ఆయన స్పందించకపోతే చెడ్డ పేరు తప్పదంటున్నారు.**

అదనపు అంతస్తయితే..

అదనపు అంతస్తు వేయాలంటే ముందుగా ఆ ప్రజాప్రతినిధి అనుచరులతో మాట్లాడాలి. వారు బిల్డింగ్ చూసి రేటు చెబుతారు. అందులో సగం చెల్లించిన తర్వాత పని ప్రారంభించాలి. భవనం పూర్తయిన **తర్వాత పూర్తి సొమ్ము** ఇవ్వాలి. లేక పోతే సమ్మెట **దెబ్బలు తప్పవు. వీరి** రేటు రూ. 5 లక్షల నుంచి **రూ.10 లక్షల వరకు ఉం**టుంది. ఇలా పలు చోట్ల వసూలు చేశారని పబ్లిక్ టాక్.. వీటన్నినీ దాటుకుని లెక్కలు చూసేసరికి చుక్కలు కనిపిస్తున్నాయని పలువురు బిల్డర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మందగించిన వ్యాపారాలు

ప్రస్తుతం ఫ్లాట్ల అమ్మకాలు అంతంత మాత్రంగా ఉన్నాయని బిల్డర్లు వాపోతున్నారు. కట్టిన ఫ్లాట్లు అమ్మకాలు సాగడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఇలా కప్పాలు కట్టి అప్పులపాలవలేమంటూ బిల్డర్లు వాపోతున్నారు. అందుకే కొత్త ప్రాజెక్టుల జోలికి వెళ్లకుండా స్తబ్దుగా ఉంటున్నామని చెబుతున్నారు.

క్లుప్తంగా

అంతర్జాతీయ సదస్సు బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఏయూ వీసీ రాజశేఖర్, రిజిస్ట్రార్ ధనుంజయరావు

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం రాజనీతి, ప్రభుత్వ పాలనా శాస్త్ర విభాగం, ఇన్‌స్టిట్యూట్ ఫర్ డెమొక్రటిక్ ఎంగేజ్‌మెంట్ అండ్ అకౌంటబులిటీ ఆధ్వర్యంలో ఏప్రిల్ 4న నిర్వహించనున్న అంతర్జాతీయ సదస్సు బ్రోచర్‌ను వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ శుక్రవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సదస్సుకు యూరోపియన్ యూనియన్–యురాసేమస్ ఆర్థిక సహకారం అందిస్తోంది. పరిశోధకులకు ఉపయుక్తంగా నిలిచే అంతర్జాతీయ సదస్సును నిర్వహించడంపై ఏయూ వీసీ సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు తదితరులు పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన అవసరం



జడ్జి గోవర్ధన్‌కు మొక్క బహూకరిస్తున్న వసతి గృహం వార్డెన్ ఝాన్సీ

ఎంవీపీకాలనీ: ఎంవీపీ సెక్టార్–10లోని గిరిజన బాలికల వసతి గృహంలో శుక్రవారం పోక్సో చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. న్యాయ శాఖ, ఎంవీపీ పోలీస్ విభాగం సంయుక్తంగా ఈ కార్యక్రమం చేపట్టాయి. విశాఖపట్నం 12వ అడిషనల్ డిస్ట్రిక్ట్ కోర్ట్ జడ్జి పి.గోవర్దన్, ఎంవీపీ కాలనీ లా అండ్ ఆర్డర్ సీఐ మురళీ పాల్గొని పోక్సో చట్టంపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. బాలికలపై ఎలాంటి భౌతిక, లైంగిక దాడులు జరిగినా పోక్సో చట్టం కఠినంగా పరిగణిస్తుందన్నారు. 18 ఏళ్ల వయసు నిండని బాలికలంతా ఈ చట్టంపై అవగాహన పెంచుకోవాలని, సీనియర్ విద్యార్థులు, జూనియర్లకు సూచనలివ్వాలని చెప్పారు. ఎలాంటి వేధింపులు, ఇతర సమస్యలున్న న్యాయ, పోలీస్ శాఖల దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ



క్షీరాభిషేక సేవలో అమ్మవారు

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు సహస్ర తులసీదళార్చన

కనకమహాలక్ష్మి అమ్మవారి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు.

రూ.3.41 కోట్ల ఆస్తి పన్ను వసూలు

గాజువాక: జీవీఎంసీ గాజువాక జోన్ అధికారులు విశాఖ స్టీల్‌ప్లాంట్ నుంచి రూ.3,41,47,156 ఆస్తి పన్ను వసూలు చేశారు. ఈ మేరకు గాజువాక జోన్ సహాయ కమిషనర్ సీహెచ్.రామనారాయణ, రెవెన్యూ అధికారి ఎం.శ్రీకాంత్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కొరాడ శివ తదితరులు స్టీల్‌ప్లాంట్ అధికారుల నుంచి తీసుకొచ్చిన చెక్కును శుక్రవారం జోనల్ కమిషనర్ బి.ఆర్.ఎస్.శేషాద్రికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన రెవెన్యూ అధికారులను అభినందించారు. ఆస్తి పన్ను పూర్తి స్థాయిలో వసూలు చేయడానికి కృషి చేయాలని సూచించారు.

చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఏర్పాటు

సింథియా: ఆడపిల్లల సంరక్షణ, బాల్య వివాహాల నిర్మూలన దిశగా చైల్డ్ వెల్ఫేర్ కమిటీని శుక్రవారం ఏర్పాటు చేశారు. 63వ వార్డులోని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆర్పీలు, సచివాలయ మహిళా పోలీస్, సచివాలయ సిబ్బందితో ఏర్పాటు చేసిన కమిటీకి చైర్మన్‌గా వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు గల్లా చిన్నాను ఎన్నుకున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన కమిటీ సభ్యులు కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న పలు కార్యకలాపాలకు ప్రణాళికలు రూపొందించారు. గల్లా చిన్నా మాట్లాడుతూ చెత్త కుండీలు, కాలువల్లో శిశువులను పడేయడం అత్యంత దుర్మార్గమన్నారు. పిల్లలు వద్దనుకుంటే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, చాలా వరకు అనైతిక సంబంధాల వల్లే ఇలా జరుగుతోందన్నారు. బాల్య వివాహాల నిర్మూలన, బాలలపై లైంగిక వేధింపులను అరికట్టడం, వాటిపై ప్రజలకు అవగాహన కల్పించడం కమిటీ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు పుక్కల కృష్ణ, గూడెల కృష్ణ, జెర్రిపోతుల నర్సింగ రావు, బోండా కృష్ణ, సచివాలయ సిబ్బంది, ఆర్పీలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతుబజార్‌లో కమర్షియల్ స్టాల్

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు ములగాడ హౌసింగ్ కాలనీలో రైతుబజార్‌లో కమర్షియల్ స్టాల్ ఏర్పాటుకు అధికారులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఇంత కాలం రైతుబజార్‌లో ఆకు కూరలు,కాయగూరలు, పండ్లు,బియ్యం అమ్మకాలు సాగించే వారు.వినియోగదారుల తాకిడి పెరగడంతో వారి సౌకర్యార్థం శనివారం కమర్షియల్ స్టాల్ ప్రారంభించనున్నారు.

మలుపు.. ప్రమాదాలకు పిలుపు

ఫోకస్



గొందేశివానిపాలెం - ములగాడ రహదారిలో ప్రమాదకర మలుపు

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు పరిధి గొందేశివానిపాలెం నుంచి ములగాడ వెళ్లే మార్గంలోని యు ఆకార మలుపు ప్రమాదాలకు కేంద్ర బిందువుగా నిలుస్తోంది.దీంతో ఆ మలుపు వద్దకు వచ్చే వాహనదారులు భయపడుతున్నారు. ఐఎన్ఎస్ ఏకశిల రక్షణ గోడ పక్క నుంచి ములగాడ వెళ్లే మార్గంలో ఉన్న మలుపు వద్ద ఎదురుగా వచ్చే వాహనాన్ని గుర్తించే పరిస్థితి లేదు. దీనికి తోడు విద్యుత్ లైట్లు లేకపోవడంతో రాత్రి సమయంలో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. కనీసం మలుపు గుర్తించే విధంగా రేడియం స్టిక్కర్స్‌తో పాటు మలుపు వద్ద స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

పట్టపగలు వెలుగులు

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలో పలు చోట్ల వీధి లైట్లు పగలూ వెలుగుతు ఉన్నాయి. 61వ వార్డు మల్కాపురం దరి వెంకన్నపాలెంలో పలు చోట్ల వీధి లైట్లు నిరంతరం వెలుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. రెండు వారాల నుంచి ఇదే పరిస్థితి ఉందని... జీవీఎంసీ ఎలక్ట్రికల్ సిబ్బందికి సమాచారం ఇచ్చినా స్పందించడం లేదని తెలిపారు.



వెంకన్నపాలెంలో పగలు వెలుగుతున్న వీధిలైట్లు

52వ వార్డులో అభివృద్ధి పనుల పరిశీలన

విశాఖ విద్య: జీవీఎంసీ 52వ వార్డులోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను శుక్రవారం డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ పరిశీలించారు. గ్రీన్‌బెల్ట్‌ల వాకింగ్ ట్రాక్‌ల్లో అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మర్రిపాలెం వుడా లేఅవుట్ ప్రాంతంలో ఆర్ అండ్ బీ జంక్షన్ దరి లలితా డిలైట్ గ్రీన్‌బెల్ట్, వనితా వాకింగ్ ట్రాక్, పాస్‌పోర్ట్ ఆఫీస్ ఎదురుగా ఉన్న గ్రీన్‌బెల్ట్‌లో మోడల్ లైటింగ్, బ్యూటిఫికేషన్ పనులు, వాటర్ సప్లై మొదలైన అభివృద్ధి పనులపై అధికారులతో చర్చించారు. కొత్తగా మంజూరైన పనుల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. కరాస ప్రాంతంలోని పలు కాలనీల్లో త్రీ ఫేజ్ ఎలక్ట్రికల్ లైన్లు పునరుద్ధరణ వంటి అంశాలపై అధికారులతో కలిసి చర్చించారు. తక్షణమే పనులను వేగవంతం చేయాలని డిప్యూటీ మేయర్ సూచించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ విభాగం హార్టీకల్చర్ ఏఈ పల్లవి, పారిశుధ్య విభాగం ఇన్‌స్పెక్టర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.



గ్రీన్‌బెల్ట్‌లో పనులను పరిశీలిస్తున్న జీవీఎంసీ డిప్యూటీ మేయర్ శ్రీధర్

వేసవిలో అప్రమత్తంగా ఉండండి

మల్కాపురం: వేసవి కాలంలో అప్రమత్తంగా ఉండాలని, రెప్పపాటు నిర్లక్ష్యం ఎంతో ఆపదను తీసుకొస్తుందని మల్కాపురం క్రైం ఎస్‌ఐ ఎం.వి.రమణ అన్నారు. మల్కాపురం పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా క్రైం ఎస్‌ఐ మాట్లాడుతూ ఇళ్లలో దొంగతనాలు జరగకుండా నివాసులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలువురికి అవగాహన కల్పించారు. వేసవిలో చాలా మంది నివాసులు మధ్యాహ్నం, రాత్రి వేళల్లో తలుపులు తీసి నిద్రించడం వంటివి చేస్తుంటారని, ఆదమరిచి నిద్రిస్తున్న సమయంలో దొంగ ఇంట్లోకి చొరబడి విలువైన వస్తువులు దొంగిలించే అవకాశాలు ఉంటాయన్నారు. సెల్‌ఫోన్‌లు కిటికీల వద్ద పెట్టడం, ఇంటి బీరువా తాళాలు నిర్లక్ష్యంగా ఎక్కడ పెడితే అక్కడ ఉంచడం, బీరువాల్లో విలువైన బంగారు ఆభరణాలు, నగదును ఉంచటం మంచిది కాదని సూచించారు. మీరు ఎంత అప్రమత్తంగా ఉంటే అంత మంచిదని వివరించారు. అనుమానితులు ఎవరైనా తమ ఇంటి పరిసర ప్రాంతాల్లో సంచరిస్తున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారమివ్వాలని కోరారు.



స్థానికులకు అవగాహన కల్పిస్తున్న క్రైం ఎస్‌ఐ రమణ

ముగిసిన రెండు రోజుల వర్క్‌షాప్

దాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన అకడమీస్ లెక్చర్ వర్క్‌షాప్ శుక్రవారంతో ముగిసింది. కళాశాల రసాయనశాస్త్ర విభాగం నేతృత్వంలో నిర్వహించిన రెండో రోజు వర్క్‌షాప్‌లో 'న్యూ ఫ్రాంటైర్స్ ఇన్ కెమికల్ సైన్స్'అంశంపై సైన్స్ అకడమీస్ లెక్చర్ వర్క్‌షాప్ నిర్వహించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. మంజుల తెలిపారు. వర్క్‌షాప్ నిర్వహించడానికి అనుమతి లభించినందుకు ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్స్, ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ, నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్స్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ వర్క్‌షాపు విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధనలకు ఎంతగానో దోహదపడతుందని చెప్పారు. ప్రొఫెసర్ కేఆర్ ప్రసాద్ 'ఆర్గానిక్ సింథసిస్', ప్రొఫెసర్ రాజకుమార్ బల్లా 'స్పెక్ట్రోస్కోపిక్ టూల్స్', ప్రొఫెసర్ బీఎల్‌వీ ప్రసాద్ 'నానోపార్టికల్స్' అంశాలపై నూతన ఆవిష్కరణలు విద్యార్థినులకు విశదీకరించారు. ఈ నేపథ్యంలో ఐఐఎస్‌సీ బెంగళూరు నుంచి వచ్చిన ఆచార్యులు ప్రొఫెసర్ కేఆర్ ప్రసాద్, ప్రొఫెసర్ రాజకుమార్ బల్లా, ప్రొఫెసర్ బీఎల్‌వీ ప్రసాద్‌ను సత్కరించారు. కార్యక్రమంలో వర్క్‌షాప్ కో ఆర్డినేటర్ డాక్టర్ బి. కల్యాణ్‌రామ్, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ బి. సంతోషి అనూష, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, వివిధ కళాశాలలకు చెందిన అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ మంజుల

గడువులోగా ఆరోగ్య కార్యక్రమాలు పూర్తి

మహారాణిపేట: వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జరిగే అన్ని ఆరోగ్య కార్యక్రమాలను నిర్దేశించిన సమయంలో పూర్తి చేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. శుక్రవారం రేసవానిపాలెంలో ఉన్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో ఆయన ప్రోగ్రామ్ అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. కుటుంబ సంక్షేమ శాఖ, మిషన్ డైరెక్టర్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు మాట్లాడుతూ ప్రధాన మంత్రి మాతృత్వ వందన యోజన, మాతా, శిశు మరణాల రేటు తగ్గింపు, గర్భిణులకు మందుల వినియోగం, ఇతర అంశాలపై జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఏఎన్ఎంలు ఎన్‌రోల్‌మెంట్ కరెక్ట్‌గా చేయాలని, వైద్యాధికారులు, ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల సిబ్బంది సమయానికి ముఖ హాజరు వేయాలని, సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలని డీఎంహెచ్‌వో తెలిపారు. అదే విధంగా పలు ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఈ జూమ్ సమావేశంలో జిల్లాలో గల ప్రోగ్రాం అధికారులు, వైద్య ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



జూమ్ మీటింగ్‌లో పాల్గొన్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

ఆ షోకాజ్ నోటీసు ఉపసంహరించుకోవాలి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె. అయోధ్యరామ్‌కు యాజమాన్యం ఇచ్చిన షోకాజ్ నోటీసును ఉపసంహరించుకోవాలని స్టీల్ ప్లాంట్ కార్మిక సంఘాల నాయకులు కోరారు. ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు శుక్రవారం ఉక్కు డైరెక్టర్ (పర్సనల్) ఎస్.సి. పాండేను కలిసి ఈమేరకు వినతిపత్రం అందజేశారు. కార్మిక సమస్యలపై పోరాడుతున్న అయోధ్యరామ్‌కు షోకాజ్ నోటీసు ఇవ్వడం అన్యాయమన్నారు. ఉద్యోగులకు పెండింగ్ ఉన్న 205 శాతం జీతాలను ఈనెల 31లోగా చెల్లించాలని కోరారు. కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపును తక్షణమే ఆపాలన్నారు.


గ్రంథాలయ ఉద్యోగులకు 010 పద్దు కింద జీతాలివ్వాలి

దాబాగార్డెన్స్: గ్రంథాలయ సిబ్బంది చిరకాలంగా కోరుతున్న 010 పద్దు కింద జీతాలు, పెన్షన్లు ఇవ్వాలని ఉత్తరాంధ్ర జిల్లాల గ్రంథాలయ సిబ్బంది, పెన్షనర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం జగదాంబ జంక్షన్ సమీపాన సిటు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో తీర్మానించారు. స్థానిక సంస్థలు వసూలు చేస్తున్న గ్రంథాలయ సెస్సును నేరుగా జిల్లా గ్రంథాలయ సంస్థల అకౌంట్‌కు జమ చేయలని, గ్రంథాలయ సంస్థలకు ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయి గ్రాంట్ వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ వివిధ తీర్మానాలు ఆమోదించింది. అనంతరం తూర్పుగోదావరి జిల్లాతో కలుపుకుని ఉత్తరాంధ్ర జిల్లాల గ్రంథాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి. మల్లేశ్వరరావు కన్వీనర్‌గా మరో 10 మందితో కమిటీ ఏర్పాటైంది. పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సలాది సత్యనారాయణ మాట్లాడుతూ గ్రంథాలయాలు ఆధునికీకరిస్తామని గ్రంథాలయాలు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అసెంబ్లీలో ప్రకటించిన నేపథ్యంలో ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సీనియర్ నాయకుడు బి. ఆనందరావు, శ్రీకాకుళం జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వైకుంఠరావు, విజయనగరం జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రామభద్రరాజు, విశాఖ, విజయనగరం జిల్లాల గ్రంథాలయ సంఘాల అధ్యక్షుడు ఆనందరావు, కె. శ్రీనివాసరావు వివిధ సమస్యలపై మాట్లాడారు. విశాఖ జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె. త్రిమూర్తులు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో తూర్పు గోదావరి, ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అధిక మంది గ్రంథాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



సమావేశమైన గ్రంథాలయ సంస్థ నాయకులు, ఉద్యోగులు

టెర్రస్ మొక్కల పెంపకంపై అవగాహన



జూలో మొక్కల కుండీలతో సంతపాలెం పాఠశాల విద్యార్థులు

ఆరిలోవ: అంతర్జాతీయ అటవీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఇందిరా గాంధీ జూ పార్కులో టెర్రస్ మొక్కల పెంపకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 12వ వార్డు సంతపాలెం ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులతో కలసి జూ పార్కును సందర్శించారు. టెర్రస్ గార్డెన్స్ వ్యవస్థాపకురాలు ఐశ్వర్య విద్యార్థులకు టెర్రస్ పంటలు, కూరగాయలు, పండ్ల మొక్కలు ఎలా పెంచాలో అవగాహన కల్పించారు. మొక్కలను కుండీల్లో ఏవిధంగా ఉత్పత్తి చేయాలి, వాటిని ఎలా పెంచాలి తదితర విషయాలను వివరించారు. పిల్లలతో కుండీల్లో మట్టి వేయడం, విత్తనాలు నాటించడం వంటివి చేయించారు. పర్యావరణంలో నాశనమవుతున్న పచ్చని చెట్ల విలాపం గురించి అవగాహన కల్పిస్తూ సంతపాలెం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సిరికి శ్రీనివాసరావు పాడిన పాట విద్యార్థులను, జూ అధికారులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో జూ క్యూరేటర్ జి.మంగమ్మ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏయూ యాదవ ఉద్యోగుల ఆత్మీయ సమావేశం రేపు

ఎంవీపీకాలనీ: ఈ నెల 23న శివాజీ పార్క్ వేదికగా ఏయూ యాదవ ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్లు సంఘ ప్రతినిధి, కార్యక్రమ సమన్వయకర్త డొక్కర శ్రీనివాస్ తెలిపారు. ఏయూ భౌతిక శాస్త్ర విభాగం వద్ద శుక్రవారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో కార్యక్రమ వివరాలు ఆయన వెల్లడించారు. శివాజీ పార్క్‌లో ఆదివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వనభోజనాలు, వివిధ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. సంఘ సభ్యులకు నిర్వహించిన క్రికెట్, షెటిల్ బ్యాడ్మింటన్, టాగ్గావార్ వంటి క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన జట్లకు బహుమతులు అందజేస్తామన్నారు. సంఘంలోని 150 మంది విశ్రాంత ఉద్యోగులను సన్మానిస్తామని చెప్పారు.